నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
10 కరీంనగర్, ఆదివారం 27 ఏప్రిల్ 2025 PEDDAPALLI

## రజతోత్సవ సభకు రారండోయ్



రజతోత్సవ సభకు రావాలని గంగాధర మండలం బూరుగుపల్లిలో డప్పు కొట్టి దండోరా వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్










నేడే బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగ



# చలో వరంగల్

## దారులన్నీ ఎల్కతుర్తి రజతోత్సవ సభకే!

*గుండెల నిండా గులాబీ జెండాను నింపుకొన్న ఉమ్మడి జిల్లా ప్రజానీకం, బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలేందుకు సమాయత్తమైంది. ఆదివారం 'చలో వరంగల్' పేరిట కదం తొక్కేందుకు సిద్ధమైంది. ఉదయం గ్రామగ్రామాన గులాబీ జెండాలు ఎగురవేసి ఆ తర్వాత ఎల్కతుర్తి సభకు కదలనున్నది. మరికొద్ది గంటల్లోనే ప్రజలు, పార్టీ శ్రేణులు ఆయా పట్టణాలు, పల్లెల నుంచి స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సభకు వెళ్లే వారికి భోజన, మంచినీటి వసతి కల్పించేందుకు పార్టీ పరంగా ఏర్పాట్లు చేసినా, ఎక్కడికక్కడే స్వచ్ఛందంగా సమకూర్చుకున్నారు. ఇదిలా ఉంటే ఆయా నియోజకవర్గాల్లో వారం పది రోజులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రత్యేక దృష్టిసారించి, ప్రజలను చైతన్యవంతం చేయడంలో సక్సెస్ అయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి రెండు లక్షల మందికిపైగా హాజరయ్యే అంచనాలు కనిపిస్తున్నాయి.*

- ఉమ్మడి జిల్లా నుంచి కదలనున్న దండు
- 2 లక్షల మంది వెళ్లేందుకు ఏర్పాట్లు
- పల్లెపల్లెనా జెండా ఎత్తి సభకు పయనం
- ఉదయం 10 గంటల నుంచే పరుగులు తీయనున్న వాహనాలు
- ఏర్పాట్లు చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు

కరీంనగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివెళ్లేందుకు సర్వం సిద్ధమైంది. వారంరోజులుగా పల్లె, పట్నం అన్న తేడా లేకుండా గులాబీ గుబాళింపు కనిపిస్తున్నది. సభకు భారీగా తరలి రావాలంటూ కేసీఆర్, కేటీఆర్ పిలుపునివ్వడం, మరోవైపు కాంగ్రెస్ వైఫల్యాలపై విసుగుచెందిన ప్రజలు తమదైన శైలిలో కేసీఆర్‌కు మద్దతు ఇవ్వాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్టు కనిపిస్తున్నది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలోని ప్రతి పల్లెలో జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. గద్దెలకు గులాబీ రంగు వేశారు. 'జై తెలంగాణ' నినాదాలు రాశారు. సభకు బయలు దేరే ముందే జెండాను ఎగురవేయాలని నిర్ణయించుకున్న నాయకులు, ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమం పూర్తి చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. సభకు వెళ్లేందుకు ఆయా గ్రామాల్లోనే ముందస్తుగా వంటలు వండుకొని, వాటిని సదరు వాహనాల్లో పెట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మంచినీరు, మజ్జిగ ప్యాకెట్ల వంటివి సమకూర్చుకొని ఎక్కడా ఇబ్బందులు రాకుండా పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోగా, దారి పొడవునా గులాబీ జెండాలను రెపరెపలాడించడమే లక్ష్యంగా ప్రతి వాహనంలో జెండాలు తీసుకెళ్తున్నారు.

### రెండు లక్షలకుపైగా..

రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు రెండు లక్షల పైచిలుకు ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివెళ్తున్నారు. కరీంనగర్ జిల్లా నుంచి లక్షాయాభై వేలు కాగా, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి 20 నుంచి 25వేల వేల మంది చొప్పున తరలివెళ్లేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఉన్న స్పందన చూస్తే అంతకు మించి జనం వెళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తున్నది. తెలంగాణ సాధన కోసం ఆనాడు సబ్బండ వర్గాలు పోరుబాట పట్టినట్టు, ఈసారి రజతోత్సవ సభకు కదులుతున్న పరిస్థితి ఉంది. ఎలాగైనా సరే వరంగల్ సభకు వెళ్లి కేసీఆర్‌కు మద్దతు పలుకాలన్న లక్ష్యం మెజార్టీ వర్గాల్లో కనిపిస్తున్నది. ఆదివారం కావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు సైతం పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నట్లుగా తెలుస్తున్నది. అలాగే ఈసారి యువతలో సభకు వెళ్లేందుకు ఎక్కువ ఉత్సాహం కనిపిస్తున్నది. మెజార్టీ గ్రామాల్లో యువతే సారథ్యం వహించి ఆయా గ్రామాల ప్రజలను సభకు తీసుకెళ్తున్నారు. ప్రజల స్పందన చూస్తే ప్రస్తుతం పార్టీ పరంగా ఏర్పాటు చేసిన వాహనాలు సరిపోవడం లేదని, అందుకే ఎవరికి వారే స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకొని వస్తున్న తీరు కేసీఆర్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### మరోసారి సత్తా

గులాబీ జెండాకు ఉమ్మడి జిల్లా ఆది నుంచీ అండగా నిలుస్తూ వచ్చింది. పార్టీ ఆవిర్భావం నుంచి మొదలు నేటి రజతోత్సవ సభ వరకు ముందుండి సంఘీభావం ప్రకటిస్తూనే ఉన్నది. అదే అభిమానంతో మరోసారి సత్తా చాటుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి గులాబీ జెండా కష్టకాలంలో ఉన్న ప్రతిసారి ఈ ప్రాంత ప్రజలు అండగా నిలిచారు. కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని ఆకాశానికి ఎత్తుకుంటూ వచ్చారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా జరిగిన సింహగర్జన సభకు అండగా నిలిచిన ఉమ్మడి జిల్లా ప్రజలు, తర్వాత కూడా తామున్నామనే ధైర్యాన్నిచ్చారు. 2006లో తెలంగాణ వాదమే లేదంటూ హేళన చేసే సమయంలో ఎంపీ పదవిని తృణప్రాయంగా వదులుకున్న కేసీఆర్, తిరిగి పోటీచేస్తే రెండు లక్షల మెజార్టీతో గెలిపించి ప్రత్యేక తెలంగాణ నినాదం ఉందని ప్రపంచానికి చాటి చెప్పారు. అంతేకాదు, పలుసార్లు వచ్చిన ఉప ఎన్నికలతోపాటు సాధారణ ఎన్నికలు, ఆమరణ నిరాహార దీక్ష వంటి అనేక అంశాల్లో కేసీఆర్‌కు ఉమ్మడి జిల్లా అండగా నిలిచింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఈసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాతినిధ్యం రజతోత్సవసభలోనూ ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తున్నది.

### అడ్డంకులు సృష్టించే ప్రయత్నం

సభకు ఉవ్వెత్తున తరలిపోయేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు ఉత్సాహం చూపుతున్న నేపథ్యంలో జనజాతరకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం పరోక్ష పద్ధతుల్లో కుట్రలకు తెరలేపిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా సభకు ప్రజలను తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ బస్సులకు సవాలక్ష నిబంధనలు పెడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. స్కూల్ బస్సుల విషయంలోనూ అదే పంథాను ప్రభుత్వం అనుసరిస్తున్నట్టు తెలుస్తున్నది. అలాగే సభకు వెళ్లకుండా మధ్యమధ్యలో ట్రాఫిక్ బూచి చూపి, ఎక్కడికక్కడే వాహనాలను నిలుపుచేసే అవకాశాలు ఉన్నాయని అత్యంత విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తున్నది. దీంతో పాటు ఇప్పటికే పలు ప్రైవేట్ వాహనాలకు ఫోన్‌చేసి, సభకు వెళ్తే చర్యలు ఉంటాయన్న సంకేతాలను కొంత మంది అధికారుల ద్వారా ఇప్పిస్తున్నట్టు సమాచారం. కానీ, ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభకు వెళ్లి తీరుతామనే పట్టుదల అడుగడుగునా కనిపిస్తున్నది.

## దిష్టి తీసి.. గుమ్మడి కాయ కొట్టి



కేసీఆర్ కటౌట్‌కు దిష్టి తీస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 : అధినేత కేసీఆర్‌కు దిష్టి తొలగాలని కోరుకుంటూ కరీంనగర్‌లోని కోతిరాంపూర్ చౌరస్తాలో కేసీఆర్ కటౌట్‌కు పార్టీ మహిళా నాయకులు దిష్టి తీశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఎలాంటి దిష్టి తగలకుండా నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి, ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



## కార్మికులందరూ కదలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు

గోదావరిఖని, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సింగరేణి గని కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్జీ-1 పరిధి 11ఏ గని వద్ద కార్మికులను కలిసి రజతోత్సవ సభకు ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేసీఆర్ సింగరేణి కార్మికులను కడుపులో పెట్టుకొని కాపాడారని, ఈ క్రమంలో నేటి సభను జయప్రదం చేసి మద్దతుగా నిలువాలని కోరారు. జాతీయ సంఘాలు నాడు సింగరేణిలో పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల ద్వారా కేసీఆర్ తిరిగి ఇచ్చారని, కార్మికుల వారసుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఇక్కడ టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, వడ్డెపల్లి శంకర్, పర్లపల్లి రవి, బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, నారాయణదాసు మారుతి, జోసెఫ్, ఆవునూరి వెంకటేశ్, రామరాజు ఉన్నారు.



గని వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

